క్లుప్తంగా

రేపు సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం



కరపత్రాలు విడుదల చేస్తున్న దేవస్థానం చైర్మన్ యాడికి శ్రీదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటావీధిలో వెలసిన శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ యాడికి శ్రీదేవి తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో ఈ వేడుకకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. 12వ తేది ఉదయం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించి తర్వాత కల్యాణోత్సవం జరుపుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆమె కోరారు.

అహోబిలేశుడి సేవలో మాజీ ఎమ్మెల్యే



స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: శ్రీ అహోబిల లక్ష్మీ నరసింహస్వామి వార్లను ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గంగుల బిజేంద్రారెడ్డి దర్శించుకున్నారు. అహోబిలం చేరుకున్న ఆయనకు ప్రధానార్చకులు వేణుగోపాలన్ స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దిగువ అహోబిలం క్షేత్రాల్లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివార్ల శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనాలు అందించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు



పోలీస్ స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

శిరివెళ్ల: ఈ నెల 12 నుంచి 17 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం ప్రశ్నపత్రాలు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ తమ పరీక్ష కేంద్రంలో మొదటి సంవత్సరం విద్యార్థులు 122 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆరుగురు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఉదయం మొదటి సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయన్నారు.

ఆశలు ఆవిరి



దొర్నిపాడులో కోతదశలో కొర్ర పంట

దొర్నిపాడు: ఆరుతడి పంటల్లో భాగంగా మండలంలో చాలా మంది రైతులు కొర్ర సాగుచేశారు. పంట కూడా ఆశాజనకంగా ఉండటంతో మంచి దిగుబడులు వస్తాయని ఆశించారు. కానీ ఇటీవల కురిసిన వర్షాలకు పంట చాలా వరకు దెబ్బతింది. ఎకరానికి 3 క్వింటాళ్లకు మించి రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ధర మార్కెట్లో క్వింటాకు రూ.3 వేలకు పైగా ఉంటే దళారులు మాత్రం రూ.2వేలకే అడుగుతున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధరతో కొర్ర కొనుగోలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధి పనుల్లో శ్రామికుల సంఖ్య పెంచాలి



క్రిష్టిపాడులో పనులను పరిశీలిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్

దొర్నిపాడు: ఉపాధి పనుల్లో శ్రామికుల సంఖ్యను పెంచేలా అవగాహన కల్పించాలని ఏపీఓ హనీఫా టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు మండలంలో 2,100 వరకు శ్రామికులు పనుల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఏప్రిల్ మొదటి వారం వరకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు శ్రామికుల వ్యక్తిగత ఖాతాల్లో జమ అయినట్లు చెప్పారు. వేతనాల చెల్లింపుల్లో ఏమైనా సమస్యలుంటే కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కొలతల మేరకు పనులు చేస్తేనే ప్రభుత్వం నిర్ణయించిన రూ.307 కూలీ వేస్తారన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున పనుల ప్రదేశాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు.

చూసిన కనులదే భాగ్యం

- గోవిందపల్లెలో వైభవంగా శివపార్వతుల కల్యాణం
- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు



శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శివపార్వతులకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : మండలంలోని గోవిందపల్లె గ్రామంలో శివపార్వతుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. నూతనంగా నిర్మించిన ఉమా మహేశ్వర ఆలయంలో వేద పండితులు పాణ్యం దక్షిణామూర్తి ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. గోపూజ, గణపతి పూజ, హోమాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం శివపార్వతుల, నవగ్రహాల ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, జగద్గురువులతో మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. తర్వాత శివపార్వతుల కల్యాణం చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణాలతో మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిగింది. చామల ఉమాదేవి, చామల చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు కల్యాణానికి కావాల్సిన నూతన వస్త్రాలు, తలంబ్రాలు, సామగ్రి అందజేశారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శివపార్వతుల కల్యాణాన్ని వీక్షించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

తెలంగాణ మంత్రి పూజలు

గోవిందపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఉమామహేశ్వర స్వామి ఆలయంలో చేపట్టిన విగ్రహ ప్రతిష్ఠోత్సవానికి తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. గ్రామ నివాసి, ప్రముఖ పారిశ్రామికవేత్త చామల చంద్రశేఖర్‌రెడ్డి ఆహ్వానం మేరకు గోవిందపల్లెకు వచ్చిన ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

తర్వాత ఆయనకు చామల చంద్రశేఖర్‌రెడ్డి శివపార్వతుల జ్ఞాపిక అందజేశారు.



ఆలయంలో మంత్రి శ్రీధర్‌బాబుకు శివపార్వతుల ప్రతిమ అందజేస్తున్న దృశ్యం

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న ఎద్దులు

ఉయ్యాలవాడ: ఉమామహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా గోవిందపల్లె గ్రామంలో నిర్వహించిన న్యూ కేటగిరి విభాగం రాతి దూలం బండలాగుడు పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన ఆర్‌కే బుల్స్ (ఆతోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి) 4085.4 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచి రూ. 80 వేలు బహుమతి గెలుచుకున్నాయి. రెండు రోజులుగా జరిగిన ఎడ్ల పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి 19 జతల వృషభాలు పాల్గొన్నాయి. విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు 4012.02 అడుగులతో ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 70 వేలు, తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా చంద్రకళ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు ఎద్దులు 3,910.07 అడుగులతో తృతీయ స్థానంలో నిలిచి రూ. 60 వేలు, కర్నూలు జిల్లా రేమట గ్రామానికి చెందిన చిన్న గిడ్డయ్య నాయుడు ఎడ్లు నాల్గవ స్థానంలో నిలిచి 50 వేలు, గుంటూరు జిల్లా కొప్పురావూరు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎద్దులు 5వ స్థానంలో నిలిచి రూ. 40 వేలు, వైఎస్సార్ కడప జిల్లా రూకవారిపల్లె గ్రామానికి చెందిన విద్య ఓబుళరెడ్డి, మాద్దిరాళ్లవారిముళ్ల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎద్దులు 6వ స్థానంలో నిలిచి రూ. 30 వేలు, కర్నూలు జిల్లా జక్కలేరు గ్రామానికి చెందిన రఫీద్, గోపాల్ గౌడ్‌కు చెందిన ఎద్దులు 7వ స్థానంలో నిలిచి రూ. 20 వేలు, వైఎస్ఆర్ కడప జిల్లా ఓబుళంపల్లెకు చెందిన సతీష్‌కుమార్‌రెడ్డి ఎద్దులు 8వ స్థానంలో నిలిచి రూ. 15 వేలు, నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం వనికినిదిన్నె గ్రామానికి చెందిన పెద్దసరబయ్య ఎద్దులు 9వ స్థానంలో నిలిచి రూ. 10వేలు గెలుచుకున్నాయి. మిగిలిన ఎద్దుల యజమానులకు రూ. 5 వేల చొప్పున నిర్వాహకులు అరికట్ల శివారెడ్డి, పేరెడ్డి మోహన్‌రెడ్డి, గడ్డం దస్తగిరిరెడ్డి, బోరెడ్డి నర్సిరెడ్డి, చామల చంద్రశేఖర్‌రెడ్డిలు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

శ్రీగణమద్దిలేటి స్వామికి క్షీరాభిషేకం



సహస్ర జలాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీగణమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్వామి వారికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే స్వామికి పల్లకీ సేవలో ఊరేగిస్తూ మేళతాళాలతో చిన్న చెరువు కట్ట నుంచి గంగాజలాన్ని తీసుకొని వచ్చి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమద్దిలేటి స్వామి ఉత్సవ మూర్తులకు సహస్ర జలాభిషేకం, క్షీరాభిషేకం, స్నపన తిరుమంజనసేవ నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మధుసూదనరాయల్ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన నరసింహ జయంతిని పురస్కరించుకొని మద్దిలేటి, శ్రీగణమద్దిలేటి, లక్ష్మినరసింహ స్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆశాకార్మికుల కనీస వేతనమివ్వాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఆశా కార్మికులకు కనీస వేతనమివ్వాలని సీఐటీయూ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, గౌరవాధ్యక్షులు ఏసురత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణకుమారి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ఆశా వర్కర్లతో పాటు స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మె చేపడుతున్నామని, ఇందులో ఆశా వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశా కార్యకర్తలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదన్నారు. సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు చెన్నమ్మ, నాగేంద్ర, మాధవి, కృపావతి, సుభద్రమ్మ, రాజేశ్వరమ్మ, నాగలక్ష్మి, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అణచివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్ బాబు

నంద్యాల(న్యూటౌన్): ఉగ్రవాదాన్ని అణచివేయాలని ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి లెనిన్ బాబు అన్నారు. ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను పురస్కరించుకుని హలో యువత.. చలో తిరుపతి పేరుతో తిరుపతిలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు మహాసభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ అంశంపై శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహాసభకు యువత వేలాదిగా తరలి రావాలన్నారు. ఉద్యోగాలు, ఉపాధి కల్పనలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. సమగ్ర యువజన విధానం అమలు కాకపోవడంతో నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హామీ మేరకు కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి రాయలసీమ జిల్లాల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, నాయకులు విష్ణు, పాములేటి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సారూ..ఇటు చూడండి



డి.కొట్టాల రహదారి పక్కన పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

రుద్రవరం: మండల పరిధిలోని డి.కొట్టాల రహదారిలో ఓ విద్యుత్ స్తంభం కిందికి ఒరిగిపోయింది. కూలిపోతే భారీ ప్రమాదం జరిగే పరిస్థితి ఉంది. గత కొద్ది రోజులుగా మండలంలో భారీగా గాలులు వీచాయి. ఆ ప్రభావానికి ఎల్లావత్తుల, డీ.కొట్టాల గ్రామాల పరిధిలో పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. పట్టించుకోవాల్సిన విద్యుత్ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై సర్కారు నిర్లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం నాయకుడు

శిరివెళ్ల: రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల పట్ల సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాయలసీమ సాగునీటి సంఘం జిల్లా నాయకుడు వైఎన్ రెడ్డి అన్నారు. శనివారం యర్రగుంట్ల, వెంకటాపురం, వనికినిదిన్నెలలో ఆయన రైతులతో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు.
సిద్దేశ్వరం అలుగు శంకు స్థాపన 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 31వ తేదీన సంగమేశ్వరం వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఏపీ అంటే అమరావతి, పోలవరం మాత్రమే కాదని అన్ని ప్రాంతాలు అందులో ఉంటాయని వాటిని కూడా సర్కారు అభివృద్ధి చేయాలన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ రాయలసీమకు మాత్రమే సాగునీటి ప్రాజెక్ట్ కావాలన్నారు. కర్నూల్‌లో కృష్ణానీటి యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలని, హంద్రీ నీవా, తెలుగు గంగ, గాలేరు నగరి, వెలుగొండ, ప్రాజెక్ట్‌లను 3 ఏళ్లలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మహానందిలో రైల్వే డీఆర్ఎం పూజలు



దర్శనానికి వస్తున్న రైల్వే డీఆర్ఎం చంద్రశేఖర గుప్తా దంపతులు

మహానంది: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర గుప్తా కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మహానందికి వచ్చారు. స్వామివారి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ ఎరమల మధు, ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. డీఆర్ఎం చంద్రశేఖర గుప్తా, కుటుంబ సభ్యులు కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, అర్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

రేపు అంకాల పరమేశ్వరీ దేవి వార్షికోత్సవం

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని అంకాల పరమేశ్వరీదేవి ఆలయంలో ఈ నెల 12న వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 12న అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమం నిర్వహిస్తామన్నారు. 13న బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం

బండి ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన జల్లి లక్ష్మీదేవి(70) అదృశ్యమైనట్లు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. లక్ష్మీదేవి శిరివెళ్లలో ఉన్న తన సోదరిని చూసేందుకని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. అయితే సోదరి ఇంటికి చేరుకోలేదు. ఇటు స్వగ్రామానికి రాలేదు. దీంతో కుమారుడు నరసయ్య తెలిసిన చోటల్లా వెతికాడు. ఆచూకీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

బేతంచెర్ల: పట్టణంలోని ఆంజనేయ, చెన్నకేశవ, మాధవ, గట్ల నరసింహస్వామి, పాలుట్ల రంగస్వామి దేవాలయాలకు సంబంధించి నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటు కోసం దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని ఈఓ మద్దిలేటి తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తులను నంద్యాల జిల్లా దేవదాయశాఖ అధికారి కార్యాలయానికి పంపాలని ఈఓ పేర్కొన్నారు. నూతన పాలకమండలి 9లో మంది సభ్యులు ఉంటారని పేర్కొన్నారు. అందులో ఎస్సీ, ఎస్టీ, నాయీ బ్రాహ్మణ, బ్రహ్మణులతో పాటు మరో 5 మంది ఉంటారు. మహిళలు 5 మంది ఉంటారని వెల్లడించారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శనివారం కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. మహిళా విభాగంలో మొత్తం 12 టీమ్‌లు, పురుష విభాగంలో 27 టీమ్‌లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కల్యాణం.. కమనీయం



చెన్న కేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: కోటపాడు శ్రీ చెన్న కేశవ వీరభద్ర స్వామి ఆలయాల్లో శ్రీ చెన్న కేశవస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. శనివారం శ్రీదేవీ, భూదేవీ సహిత చెన్న కేశవస్వామి కల్యాణం ఆలయ పూజారి శ్రీనివాసుల ఆధ్వర్యంలో తిరుపతి వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు స్వామి వార్లకు సుప్రభాత సేవ, అభిషేకాలు జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు. ఈ నెల 11వ తేదీన జరగనున్న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. కార్యక్రమంలో ఈఓ రామాంజనేయ శర్మ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అదనపు డాక్టర్ నియామకం

శిరివెళ్ల: స్థానిక ప్రభుత్వ ఆరోగ్య వైద్య కేంద్రం అదనపు డాక్టర్‌గా ఆంజనేయులు నియమితులయ్యారని మండల వైద్యాధికారి డాక్టర్ ముఖేష్ శనివారం తెలిపారు. గత డాక్టర్ దివ్య ఉన్నత చదువుల కోసం సెలవుల్లో వెళ్లడంతో ఈ నియామకం జరిగిందన్నారు. అదనపు డాక్టర్ యశోద సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ నందు పని చేశారన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నందికొట్కూరు: పట్టణంలోని ఎన్‌టీఆర్ జలాశయంలో శనివారం గుర్తుతెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. 55 ఏళ్ల వయస్సు ఉంటుందని, క్రీమ్ కలరు రంగు, తెలుపు, నిలువు గీతలు ఫుల్ షర్ట్ ధరించాడన్నారు. 9 పొరల తెల్లని దారం జంజం ఉందన్నారు. షర్ట్‌పై కేఎస్ఎల్ 111 లేబుల్ ఉందన్నారు. ఎవరైనా అతడి ఆచూకీ తెలిస్తే 91211 01187కు సమాచారం ఇవ్వాలన్నారు. వీఆర్వో ఎం.సోమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆపరేషన్ సింధూర్ విజయవంతంపై సంబరాలు





నంద్యాలలో మాజీసైనికులు,చిన్నారుల సంబరం, ఆంజనేయస్వామి గుడిలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

నంద్యాల(అర్బన్): పహల్గాంలో అమాయకులను చంపిన పాకిస్తాన్ ఉగ్రవాదులపై సింధూర్ పేరుతో భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ విజయవంతం కావడంపై నంద్యాల పట్టణంలో సంబరాలు చేసుకున్నారు. మాజీ సైనికులు సుంకిరెడ్డి, గురువయ్య, శివారెడ్డి, రామసుబ్బయ్య, శ్రీనివాసులు, యువరాజు, ప్రవీణ్ తదితరులు చిన్నారులతో కలిసి స్థానిక గిరిన్నాథ్ సెంటర్‌లో వేడుకలు చేసుకున్నారు. మాజీ సైనికుడు సుంకిరెడ్డి మాట్లాడుతూ మన సైనికులు పోరాటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సన్నాల సాయిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **నంద్యాల(వ్యవసాయం):** భారత సైన్యానికి మద్దతుగా బీజేపీ నాయకులు శనివారం పలు ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు, ఆకుపూజలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బైటిపేట శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో రాష్ట్ర బీజేపీ నాయకులు డాక్టర్ ఇంటి ఆదినారాయణ, నర్సింగరావు, నిమ్మకాలయ సుధాకర్, సుబ్బారెడ్డి, రమేష్, శివరామిరెడ్డి, బాలీశ్వరరెడ్డి, గోపి, సుదర్శన్, ఎల్లయ్య, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో మెలగాలి

- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫ్యాక్షన్‌జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి

గోస్పాడు: గొడవల జోలికి వెళ్లకుండా కలసిమెలసి జీవించాలని ఫ్యాక్షన్‌జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో శనివారం రాత్రి స్థానిక ఎస్ఐ వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెప్పుడు మాటలు విని ఘర్షణకు పాల్పడవద్దన్నారు. ఏవైనా సమస్య ఉంటే పోలీసులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామాల్లో నేర చరిత్ర ఉన్న వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కనిపించే దైవం 'అమ్మ'

నంద్యాల(అర్బన్): ఎంత కష్టమొచ్చినా కడుపులో దాచుకొని బిడ్డకు ప్రేమను పంచుతుంది తల్లి. స్వచ్ఛమైన, నిర్మలమైన మనసు కలిగిన అమ్మ గురించి ఇలా ఎంత చెప్పినా తక్కువే. నేడు ప్రపంచ మాతృ దినోత్సవం సందర్భంగా చిత్రకారుడు కోటేష్ మనుషులు, జంతువుల్లో అమ్మ ప్రేమ గొప్పదనంపై వాటర్ కలర్స్‌తో అంగుళం పొడవు, వెడల్పు గల డ్రాయింగ్ చార్ట్‌పై 60 సూక్ష్మ కళ చిత్రాలు గీసి అబ్బురపరిచాడు.



కోటేష్ వేసిన అమ్మ ఊహా చిత్రం